క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ బాలాజీప్రసాద్

నెల్లిమర్ల: నగర పంచాయతీలోని అగురువీధి సచివాలయం పరిధి కీర్తివీధి అంగన్‌వాడీ సెంటర్‌ను నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారుల హాజరు, బాలామృతం, సంపూర్ణ పోషణ, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన సరుకులను పరిశీలించారు. పౌష్టికాహార లోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎం ధనలక్ష్మి, వార్డు మహిళా కార్యదర్శి కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తే చర్యలు



దాబా యజమానులతో మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: పట్టణ పరిధిలో ఉన్న దాబాల్లో నిబంధనలు అతిక్రమించి మద్యం విక్రయాలు చేపడితే కఠినచర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అన్నారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో దాబా యజమానులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాబాల్లో మద్యం విక్రయించేందుకు ఎటువంటి అనుమతుల్లేవన్నారు. ఈ విషయంలో కచ్చితంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

ఏటీఎం విధానంతో నిరంతర ఆదాయం



జీవామృత కుండీలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

విజయనగరం రూరల్: రైతులు ఏటీఎం విధానంలో పలు రకాల పంటలు సాగు చేయడం ద్వారా నిరంతర ఆదాయం పొందవచ్చని ఆర్‌టీఎల్ ప్రకాష్, ఆర్టీఓ హేమసుందర్ అన్నారు. మండలంలోని కోరుకొండలో రైతులు సాగుచేస్తున్న ఏటీఎం విధానాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ, ఏటీఎం మోడల్‌తో సాధారణ పంటలతో పాటు ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి మొక్కలతో ఆదాయంతో పాటు ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మెంటర్ ఎస్.నాగమణి, మండల యాంకర్ ఎస్.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా అన్న ప్రసాదశాల

విజయనగరం టౌన్: పంచముఖ ఆంజనేయ స్వామిలో నూతన అన్న ప్రసాదశాల భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉందని నిత్యాన్నదాన ప్రసాద వితరణ ట్రస్ట్ చైర్మన్ బొద్దు సత్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక అంజేయ స్వామి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భవనాన్ని నవంబర్ నాలుగో తేదీన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభిస్తారన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేదారిశెట్టి సీతారామమూర్తి, పెంటపాటి కామరాజు, గోకవరపు ఉదయ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు గురువారం అందించిన వివరాలిలా ఉన్నాయి. గాజులరేగ గుబేల్‌పేటకు చెందిన వంకర సాయి (25) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 27న స్కూటీపై ఇంటికి వెళ్తూ సీతం కళాశాల వద్దకు వచ్చేసరికి డివైడర్ ఢీ కొన్నాడు. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108 వాహనంలో కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. వన్‌టౌన్ ఎస్సై ఆర్.గోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్రంగా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ సర్వే

గజపతినగరం: ఎన్నికలు దగ్గర పడుతున్నందున ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ (ప్యూరిఫికేషన్) సర్వేను బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో సమగ్రంగా చేయాలని గజపతినగరం నియోజకవర్గం ఓటర్ల నమోదు అధికారి(ఈఆర్ఓ) బి.వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక పురిటి పెంట స్కూకాల నీలో పాత మండల పరిషత్ భవనంలో బీఎల్ఓలు,బీఎల్ఎలకు ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ సర్వేపై గురువారం అవగాహన కల్పించారు.

అందరి సహకారంతో..

పండగ విజయవంతం

- డిప్యూటీ కోలగట్ల స్పీకర్ కోలగట్ల
- సిరిమాను తయారీదారులకు సన్మానం



సిరిమాను తయారు చేసిన వడ్రంగులను సత్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు

విజయనగరం టౌన్: అందరి సహకారం, సమన్వయంతో పైడితల్లి పండగను ఆనందంగా నిర్వహించుకున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. పైడితల్లి అమ్మవారి చదురుగుడి వద్ద సిరిమాను తయారీదారులను గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా సిరిమానును రూపుదిద్దిన తాళ్లపూడి సోమినాయుడు, కోరాడ నారాయణ, కె.రమణ, మహంతి జగన్నాథం, గురాన బుల్లి, గన్నేవరపు శ్రీను సత్కరించి, ఆర్థిక సహాయం చేశారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, ఉత్తరాంధ్రకే తలమానికంగా నిలుస్తున్న పైడితల్లి సిరిమానోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడంలో అందరి సహకారం మరువలేనిదన్నారు. ఎన్నడూ లేనివిధంగా ఆహ్లాదకర వాతావరణంలో జాతర జరిగిందని చెప్పారు. లక్షలాది మంది భక్తులు తరలి వచ్చినా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు తీసుకున్న ముందస్తు చర్యలు అభినందనీయమన్నారు. జాతర సమయంలో ప్రముఖుల తాకిడి తగ్గడంతో సామాన్య భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం సరళతరంగా మారిందని తెలిపారు. సిరిమాను రూపకల్పనలో తరతరాలుగా సేవలందిస్తున్న ఆయా కుటుంబాల వారిని సన్మానించుకోవడం మన కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమిషనర్ సుధారాణి, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, పూజారి బంటుపల్లి వెంకటరావు, దేవస్థానం పాలకమండలి సభ్యులు, పైడిమాంబ సేవా సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయం..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్లను సత్కరించిన పౌర వేదిక ప్రతినిధులు



డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని సత్కరిస్తున్న భీశెట్టి, తదితరులు

విజయనగరం పూల్‌బాగ్: పైడితల్లి సిరిమానోత్సవం విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాజ్జీ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆచంట గార్డెన్‌లో డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిని సత్కరించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ, రాజకీయాలకతీతంగా పండగ నిర్వహించేందుకు డిప్యూటీ స్పీకర్ ఎంతో కృషి చేశారన్నారు. ముఖ్యంగా పట్టణ సుందరీకరణ, రోడ్ల వెడల్పు, విద్యుత్తు దీపాల అలంకరణ, ఆచంట గార్డెన్‌ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దడం, ఫ్లెక్సీలు కట్టకుండా చర్యలు తీసుకోవడం, తదితర అంశాలు పండగకి అందం తెచ్చాయని కొనియాడారు. మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నగర కమిషనర్ శ్రీరాములనాయుడు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికా పాటిల్ ఉత్సవాలు విజయవంతం కావడానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు పిడకల ప్రభాకరరావు, జలంత్రి రామచంద్ర రాజు, ఇప్పలవలస గోపాలరావు, తాడేపల్లి నాగేశ్వరరావు, విశాల, కార్పొరేటర్లు రాజేష్, తవిటిరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమం..

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



ప్రభుత్వం ద్వారా పొందిన పథకాల లబ్ధిని వృద్ధ దంపతులకు వివరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు

భోగాపురం: రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గూడెపువలసలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కొయ్య రాజుకమల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అప్పలనాయుడు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగున్నరేళ్ల కాలంలో ఒక్కో ఇంటికి కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జన్మభూమి కమిటీలు అమోదం తెలిపితేనే గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, పింఛన్లు, రేషన్ కార్డులు అందేవన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదన్నారు. గ్రామాల్లో పర్యటించినప్పుడు పథకాలు అందుతున్నాయని ప్రజలంతా సంతోషంగా చెబుతుండడం సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో పడాల భాను ప్రకాష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బైరెడ్డి ప్రభాకరరెడ్డి, కొయ్య లక్ష్మణ్, పడాల శ్రీనివాసరావు, కొల్లు రామ్మూర్తి, అప్పలరెడ్డి, కిలారి వెంకటరమణ, అప్పురభుక్త పైడినాయుడు, ఎంపీడీఓ అప్పలనాయుడు, ఉప తహసీల్దార్ ఎస్. శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ సురేష్, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ..



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

- కార్పొరేటర్ రేవతీదేవి

విజయనగరం: ప్రజల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని 13వ డివిజన్ కార్పొరేటర్ రేవతీదేవి అన్నారు. కొత్తపేట కుమ్మరివీధి వద్దనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చూపిస్తున్న శ్రద్ధ మరువరానిదన్నారు. సాధారణ రోగాలకు చికిత్స అందిస్తుండడంతో పాటు దీర్ఘకాలిక రోగులను గుర్తించి మెరుగైన వైద్యం కోసం రిఫరల్ ఆస్పత్రులకు పంపిస్తున్నట్లు చెప్పారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు రామకృష్ణ మాట్లాడుతూ, డివిజన్ ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

లెండి విద్యార్థుల ప్రతిభ



నిర్వాహకుల నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విజేతలు పూసపాటి హాషిత, స్నేహలతారెడ్డి, భవ్యసాయికీర్తి

డెంకాడ: ఎడ్‌గ్రూమ్ బ్లాగ్ రైటింగ్ కాంటెస్ట్‌లో లెండి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, తదితరులు గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విదేశీ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ స్కైలార్క్ మద్దతుతో యువతలో రైటింగ్ స్కిల్స్‌ను పెంపొందించే లక్ష్యంతో బ్లాగ్ రైటింగ్ చాలెంజ్ పోటీలు నిర్వహించిందన్నారు. ఈ పోటీల్లో కళాశాలకు చెందిన 538 మంది మూడో సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. సీఎస్ఈ విభాగానికి చెందిన పూసపాటి హాషిత ప్రథమ.. సీఎస్ఎస్ఈ విభాగానికి చెందిన స్నేహలతారెడ్డి, భవ్యసాయికీర్తి ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారన్నారు. అలాగే మరో 50 మంది ప్రసంశాపత్రాలు అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్కైలార్క్ సీఈఓ కూచిపూడి సతీష్, ఎడ్‌గ్రూమ్ వ్యవస్థాపకుడు పాణ్యం వెంకటేష్, స్విగ్గీ డేటా సైటింస్ట్ గంగవరం విశ్వనాథ్, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ తమ్మినేని హరిబాబు, కె.నరసింహం, విభాగాధిపతులు ఎం.రాజన్‌బాబు, కె.సుబ్రహ్మణ్యం, సతీష్‌పూజారి, రాజేందర్, జి.సతీష్, పి.దుర్గాశైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి

- ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి



వ్యవసాయ పరిశోధన స్థానంలో పర్యటిస్తున్న శారదా లక్ష్మీదేవి, తదితరులు

విజయనగరం ఫోర్ట్: చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్. శారదా జయలక్ష్మీదేవి అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె స్థానిక గాజులరేగ వ్యవసాయ పరిశోధన స్థానాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పడిపోని రకాలు, పక్షుల బెడద నుంచి తట్టుకునే కంకు ఉండే రకాలను వృద్ధి చేయాలన్నారు. అదేవిధంగా అగ్గితెగులు తట్టుకునే రకాలపై పరిశోధనలు చేయాలని సూచించారు. జిల్లాకు విశిష్ట అనే వేరుశనగ రకాన్ని పరిచయం చేయాలన్నారు. భూమిలేని వారికి కోళ్ల పెంపకం, పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ ఇచ్చి.. ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రానున్న రోజుల్లో చిరుధాన్యాలు, ఆరుతడి పంటల అవసరం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉత్తర కోస్తా జిల్లాల సహా పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవీకే జగన్నాథరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ నర్సుపల్లి అనురాధ, తేజశ్వీరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని చిన్నవీధిలో రూ.10 లక్షల మండల ప్రజా పరిషత్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకువచ్చి పేదల ఇంటి ముంగిటే సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్ స్థానంలో ఉందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పడాల భానుప్రకాష్, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, కొమ్మూరు సుభోషణరావు, పోతిరెండి గోపి, నరేడ్ల ప్రసాద్, అడపా ప్రసాద్, బొల్లు గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో ముందుండాలి



నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: వ్యాపార సంస్థలు కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా సమాజ సేవలో ముందుండాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని కంటోన్మెంట్ ప్రాంతంలో సారథి వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంధ విద్యార్థుల సంస్థకు ముత్తూట్ ఫైనాన్స్ సంస్థ అందజేసిన రూ. 1.75 లక్షల చెక్కును జెడ్పీ చైర్మన్ నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాపార సంస్థలు లాభాలలో కొంత మొత్తాన్ని సేవా సంస్థలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ కార్పొరేషన్ జోనల్ అధికారి వై.లక్ష్మీనారాయణ, సారథి వెల్ఫేర్ అసోసియేషన్ కోఆర్డినేటర్ ప్రతాప్, వెంకటరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిరిమాను తరలింపు రేపు

విజయనగరం టౌన్: పైడితల్లి సిరిమానును శనివారం ఉదయం 7 గంటలకు ఆలయం వద్దనుంచి హుకుంపేటలో ఉన్న రాజగోపాల్ టాంగ్రీకి తరలించనున్నట్లు పూజారి బంటుపల్లి వెంకటరావు తెలిపారు. ఈ మేరకు టాంగ్రీ పరిసరాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిరిమానును తీసుకువచ్చే మార్గాలను చూశామని, ఎటువంటి ఇబ్బందుల్లేకుండా దీక్షాపరుల భజనలతో వేకువజామున సిరిమాను తరలిస్తామన్నారు. దీక్షాపరులందరూ సమయానికి హాజరుకావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

- ఎస్టీ కమిషన్ చైర్మన్‌కి గిరిజన సంఘాల వినతి



ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును సత్కరిస్తున్న గిరిజన సంఘు నాయకులు

విజయనగరం అర్బన్: గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గ్రామాల నుంచి గిరిజనులు ఇచ్చిన వినతిపత్రాలను ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావుకు గురువారం అందజేశారు. సమస్యలపై చైర్మన్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా శంకరరావును గిరిజన సంఘ ప్రతినిధులు సత్కరించారు. చైర్మన్‌ను కలిసిన వారిలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్‌టీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మానెపాటి నవీన్, గిరిజన ప్రజా సమాఖ్య (జీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ హనుమంతు నాయక్, రామచంద్రనాయక్, రామంజీ తిరుపాలు ఉన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు



బంద్ వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: విశాఖ ఉక్కు పోరాటానికి నవంబర్ 8తో 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ, కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం నవంబర్ 8న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి, యువజన సంఘాలు పిలుపునిచ్చాయి. గురువారం స్థానిక అమర్ భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో బంద్‌కు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, పీడీఎస్ఓ రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌతమి మాట్లాడుతూ, విద్యార్థి యువజన సంఘాలు తలపెట్టిన ఈ రాష్ట్ర స్థాయి విద్యాసంస్థల బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. 32 మంది ప్రాణాల బలిదానంతో 23 వేల ఎకరాల విస్తీర్ణంలో కేవలం రూ.4800 కోట్ల పెట్టుబడితో ప్రారంభమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దాదాపు రూ.54 వేల కోట్లు తిరిగి చెల్లించిన విశాఖ ఉక్కును అదాని, అంబానీలకు కట్టబెట్టాలనుకోవడం సరికాదన్నారు. 32 లక్షల టన్నుల ఉత్పత్తి నుంచి 74 లక్షల టన్నులకు చేరుకుని నేడు మూడు లక్షల కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులతో లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక ప్రజా సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు. విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, రాము, పీడీఎస్ఓ నాయకుడు రాకేష్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రుద్రరాజు, హరీష్, పి.గౌరీశంకర్, ఎ.సుమన్ పాల్గొన్నారు.